A1TV NEWS

# ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంచిక :01 సంపుటి : 51 శనివారం 19 08-2023 ఆగస్టు పేజీలు 4. వేల :4 /

# వరల్డ్ టూరిజం మ్యాప్‌లో ఆంధ్రరాష్ట్రాన్ని నిలపాలి

**-రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి హోటల్స్ రావాలి**

**-మంచి టూరిజం పాలసీని తీసుకువచ్చి సహాయ, సహకారాలు అందిస్తున్నాం**

**-విజయవాడలో హయత్ ప్లేస్ హోటల్ ప్రారంభోత్సవంలో సీఎం జగన్**




ఆంధ్ర ప్రగతి విజయవాడ ఆగస్టు 18: ఆంధ్రరాష్ట్రాన్ని వరల్డ్ టూరిజం మ్యాప్‌లో నిలిపేందుకు ముందుకువచ్చే ప్రతి సంస్థకు చేయూతనిచ్చి ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన ఇంటర్నేషనల్ హోటల్స్ రావాలని కోరుకుంటున్నామని చెప్పారు. విజయవాడ గుణదలలో నూతనంగా నిర్మించిన హయత్ ప్లేస్ హోటల్‌ను ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారు.

హోటల్ ప్రారంభం అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం జగన్ మాట్లాడుతూ.. విజయవాడలోనే కాకుండా ఆంధ్రరాష్ట్రమంతటా ఇటువంటి ప్రసిద్ధిగాంచిన హోటల్స్ రావాలని, వరల్డ్ టూరిజం మ్యాప్‌లో రాష్ట్రానికి ప్రత్యేకమైన స్థానం రావాలని ఆకాంక్షించారు. అందుకోసం మంచి టూరిజం పాలసీని తీసుకువచ్చామని, రాష్ట్రంలో హోటల్స్ స్థాపించే సంస్థలను ప్రోత్సహిస్తూ వస్తున్నామని చెప్పారు.

11 సంస్థలు రాష్ట్రంలో బ్రాంచిలు ఏర్పాటు చేయనున్నాయి. ఒబేరాయ్ హోటల్స్ మొదలుకొని నేడు ప్రారంభించిన హయత్ ప్లేస్ వరకు మొత్తం 11 పెద్ద పెద్ద సంస్థలు రాష్ట్రంలో వారి బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తున్నాయని సీఎం జగన్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌ను వరల్డ్ టూరిజం మ్యాప్‌లో పెట్టేందుకు ప్రభుత్వ పరంగా వారికి అన్ని రకాలుగా సహాయ, సహకారాలు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం ఇంకా నలుగురికి స్ఫూర్తిని ఇవ్వాలని, అనేక మంది పారిశ్రామిక వేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావాలని సీఎం జగన్ కోరారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిచూపేవారందరికీ ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. అనంతరం హోటల్ చైర్మన్ వీరస్వామి, హయత్ ఇంటర్నేషనల్ గ్రూప్ ఏరియా ప్రెసిడెంట్ శ్రీకాంత్, చైర్మన్ వీరస్వామి తనయుడు కార్తీక్, ఈ ప్రాజెక్టులో మమేకమైన వారందరికీ సీఎం జగన్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు

## ముఖ్యమంత్రి పదవి స్వీకరించేందుకు నేను సిద్ధం... కానీ..: పవన్ కల్యాణ్



ముఖ్యమంత్రి పదవి కోసం తాను ఇప్పటికే సంసిద్ధత వ్యక్తం చేశానని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. సీఎం పదవికి సిద్ధమని తాను పిఠాపురంలో, గాజువాక సభలలో చెప్పానని గుర్తు చేశారు. విశాఖపట్నంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... తాను సీఎం పదవికి సిద్ధమని చెప్పినప్పటికీ, మనది ప్రజాస్వామ్య దేశమని, ఎమ్మెల్యేలు అందరూ కలిసి ముఖ్యమంత్రిని ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. తన సీఎం పదవిని ప్రజలు నిర్ణయించాలన్నారు. తాను ఉభయ తెలుగు రాష్ట్రాలలో, తమిళనాడు, కర్ణాటకలలో ప్రభావితం చేయవచ్చునని, కానీ రాజకీయాలు వేరన్నారు. ఓట్లు చీలకూడదనే ఉద్దేశ్యంతో తాను ఉన్నానని, టీడీపీ, జనసేన పొత్తా? లేక బీజేపీతో వెళ్లడమా? అన్నది చర్చలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాడుతామన్నారు.

జగన్ పక్కా వ్యాపారిలా మారిపోయాడని, వైసీపీ వచ్చాక రాష్ట్రంలో క్రిమినాలిటీ వ్యవస్థీకృతమైందని ఆరోపించారు. బ్రిటిష్ వాళ్లలా జగన్ విభజించి పాలిస్తున్నారన్నారు. మైనింగ్ దోపిడీ పెరిగిందని, వైసీపీ నేతలు ఉత్తరాంధ్ర వనరులు దోచేస్తున్నారన్నారు. లాటరైట్ అని చెప్పి బాక్సైట్ తవ్వుతున్నారని ధ్వజమెత్తారు. జగన్ పాలనలో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. తాడేపల్లిలో నేరాలు పెరిగిపోయాయన్నారు. బాధితులు పోలీసుల వద్దకు వెళ్తే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అందుకే నిన్న తన వద్దకు 400 పిటిషన్లు వచ్చాయన్నారు. బాధితులను కేసులు ఉపసంహరించుకోమని పోలీసులే చెప్పడం బాధాకరమన్నారు. 2004 నుండి కొనుగోలు చేసిన భూమి కోసమే విశాఖకు వస్తున్నారని జగన్‌పై విమర్శలు గుప్పించారు. ఉత్తరాంధ్ర వనరులను దోచేస్తే అడిగేవారు లేరన్నారు. ఉత్తరాంధ్రలో భూదోపిడీ పెరిగిందన్నారు. రాష్ట్రం నేరాలకు నిలయంగా మారిందన్నారు. చిత్తూరులో ఒకేరోజు చాలామంది బాలికలు అదృశ్యమైతే, ఏ ఆధారాలతో మాట్లాడుతున్నారని అడుగుతున్నారని వాపోయారు. అందుకే పోలీస్ స్టేషన్ వరకు రాకముందే తన వద్దకు పెద్ద ఎత్తున పిటిషన్లు వచ్చాయన్నారు. ప్రశ్నిస్తే తల్లిదండ్రుల పెంపకం లోపమని కూడా అంటున్నారన్నారు. రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం పన్నులమయం చేసిందన్నారు. గ్రీన్ ట్యాక్స్ కూడా వసూలు చేస్తున్నారన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల్లో చైతన్యం ఉన్నప్పటికీ, కొంతమంది నాయకుల చేతుల్లో ఉండిపోయారన్నారు. మహిళలపై లైంగిక దాడి జరిగితే హోంమంత్రి వచ్చి తల్లిదండ్రుల పెంపకం తప్పు, దొంగతనం చేయడానికి వచ్చి అలా చేశాడని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఉత్తరాంధ్ర భూములు దోపిడీకి గురవుతున్నాయన్నారు. ఎంతమంది బిడ్డలు ఉన్నా అమ్మఒడి ఇస్తామని చెప్పి ఇప్పుడు ఒక్కరికే ఇస్తున్నారని, ఎంత కరెంట్ వాడుకున్నా ఉచితమని చెప్పి ఇప్పుడు వేల రూపాయల బిల్లులు వేస్తున్నారు. తాను 30వేల మంది మహిళలు మిస్సింగ్ అయ్యారంటే వైసీపీ వారంతా తనను తిడతారని, ఈరోజు ముగ్గురు అమ్మాయిలు ఒకేరోజు మిస్ అయినట్లు పేపర్లో వార్త వచ్చిందన్నారు. రాష్ట్రాన్ని పరిపాలించడం లేదని, వ్యాపారం చేస్తున్నాడని, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడన్నారు. సీఎం జగన్ రాజకీయ నాయకుడు కాదని, మొదటి నుండి వ్యాపారి కాబట్టి అలాగే చేస్తున్నాడన్నారు. అలాగే క్రిమినల్, క్రిమినల్ మైండ్ తో అందరినీ భయపెట్టి దోచుకుంటున్నాడన్నారు. పోలీసులు చూస్తుండగా మత్స్యకారుల బోట్లు తగులబెట్టించాడన్నారు.

## ఏపీ బీజేపీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించిన పురందేశ్వరి

**- ఇటీవలే ఏపీ బీజేపీ పగ్గాలు అందుకున్న పురందేశ్వరి**

**- రాష్ట్ర కార్యవర్గానికి కొత్త రూపు - మొత్తం 26 మందితో ఏపీ బీజేపీ కార్యవర్గం**

**- వివిధ కమిటీలు, మోర్చాలకు అధ్యక్షుల నియామకం**



ఇటీవలే ఏపీ బీజేపీ చీఫ్ గా పగ్గాలు అందుకున్న దగ్గుబాటి పురందేశ్వరి తనదైన శైలిలో ముందుకు వెళుతున్నారు. తాజాగా ఆమె రాష్ట్ర బీజేపీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ కార్యవర్గంలో 26 మందికి స్థానం కల్పించారు.

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా విష్ణువర్ధన్ రెడ్డి, మాధవ్, ఆదినారాయణరెడ్డి, విష్ణుకుమార్ రాజుతో పాటు మరో 11 మంది నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా కాశీ విశ్వనాథరాజు, బిట్ర శివన్నారాయణ, దయాకర్ రెడ్డి, తపనా చౌదరి నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శులుగా 10 మందికి అవకాశం కల్పించారు.పురందేశ్వరి పలు మోర్చాలకు కూడా అధ్యక్షులను ప్రకటించారు. బీజేపీ ఏపీ యువ మోర్చా అధ్యక్షుడిగా మిట్టా వంశీని, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా నిర్మలా కిశోర్ ను నియమించారు. బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా కుమారస్వామి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా దేవానంద్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా గోపీ శ్రీనివాస్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా ఉమామహేశ్వరరావు, మైనారిటీ మోర్చా అధ్యక్షుడిగా షేక్ బాజీ నియమితులయ్యారు. ఇక, బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్చార్జిగా పాతూరి నాగభూషణంను నియమించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులుగా ఏడుగురికి అవకాశం కల్పించారు.

# కేసులు మాఫీ చేసే వారి కోసం ఎంపీ సీట్లు అమ్ముకున్నారు: చంద్రబాబు

టీడీపీ అధినేత చంద్రబాబు భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా కోనసీమ జిల్లా అమలాపురం విచ్చేశారు. ఇక్కడి గడియారం స్తంభం సెంటర్ లో ఏర్పాటు చేసిన చంద్రబాబు ప్రసంగిస్తూ... సీఎం జగన్ పై తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు.

నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో చీకటిపాలన కొనసాగుతోందని అన్నారు. ప్రతి రోజూ ప్రజలను దోచుకోవడమేనని పేర్కొన్నారు. రేపు జరిగే ఎన్నికలు పేదలకు, పెత్తందార్లకు మధ్య జరిగే పోరాటం అంట... అబ్బ... ఎంత ఆరాటం అయ్యా ఈయనకు! అంటూ వ్యాఖ్యానించారు. పేదల రక్తాన్ని తాగే జలగ... ఈ జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. పేదవాళ్లను దోచేశాడు... ఇక మిగిలింది మీ గోచీ మాత్రమే... రేపు మళ్లీ ఇతనే వస్తే మనకు గోచీ కూడా మిగలదు అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలతో దోమల బెడద ఎక్కువైందన్నారు. రాని విద్యుత్ కు కూడా చార్జీల పేరుతో భారం మోపుతున్నారని చంద్రబాబు మండిపడ్డారు. అవినీతి సీఎం నిర్ణయాల వల్ల ప్రజలపై భారం పడిందని, ప్రజల్లో అప్పులేని వారు ఎవరైనా ఉన్నారా అని ప్రశ్నించారు. టీడీపీ వచ్చాక విద్యుత్ చార్జీలు పెంచబోనని, అవసరమైతే విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని చంద్రబాబు ప్రకటించారు.

చంద్రబాబు ప్రసంగం హైలైట్స్...

దేశంలోనే ధనిక సీఎం ఈ సైకో జగన్ రెడ్డి.

కేసులు మాఫీ చేసేవారి కోసం ఎంపీ సీట్లు అమ్ముకున్నారు.

కేంద్రం మెడలు వంచుతామని ప్రగల్భాలు పలికి, మెడలు దించారు.

పోలవరం నిధుల గురించి జగన్ ఎప్పుడైనా మాట్లాడారా? పోలవరాన్ని గోదావరిలో ముంచేశారు.

విభజన హామీలు కడప స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ వచ్చాయా? కేంద్రం మంజూరు చేసే ఒక్క విద్యాసంస్థ అయినా ఏర్పాటు చేశారా?

పార్లమెంటులో ఒక్క రోజైనా ప్రజల సమస్యలను ప్రస్తావించారా?

బాబాయ్ హత్యలో తమ్ముడ్ని కాపాడుకునేందుకు జగన్ యత్నిస్తున్నారు.

హత్యా రాజకీయాలు నాకు చేతకాదు... అవి నా వారసత్వం కాదు.

పవన్ నిజాలు మాట్లాడితే ఆయనపైనా విరుచుకుపడుతున్నారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ రాస్తే మీడియాపై దాడులు చేస్తున్నారు.

ఎవరూ వాస్తవాలు చెప్పకూడదని జగన్ భావిస్తున్నారు. నేను జగన్ మాదిరి మోసం చేయను... చెప్పింది చేస్తా.

భవిష్యత్తు గ్యారెంటీ... బాబు ష్యూరిటీ... ఇదే నా నినాదం. ఇక వైసీపీ ఓటమిని ఎవరూ ఆపలేరు. వైసీపీకి ఎక్స్ పైరీ డేటు వచ్చేసింది.

ఈసారి జన సునామీతో వైసీపీ చిత్తుగా ఓడిపోవడం ఖాయం.



# అక్రమ సస్పెన్షన్, అక్రమ పోస్టింగ్ పై కలెక్టర్‌కు ఉద్యోగుల గ్రీవెన్స్ డే లో ఫిర్యాదు.

ఆంధ్ర ప్రగతి కర్నూలు ఆగస్టు 18:
కడప ఆర్జేడీ శ్రీ వెంకట కృష్ణారెడ్డి, కర్నూలు డీఈఓ రంగారెడ్డి మరియు కర్నూలు డీఈఓ కార్యాలయ సిబ్బంది కలిసి ప్రభుత్వ నియమ నిభందనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అంశాలలో భాగంగా విద్యా వ్యవస్థలో లోపాలు, మోసాలు, దోపిడిని వెలికి తీస్తున్నాననే ద్వేషంతో, తనపై కక్ష పెంచుకొని ఇనానిమస్ కంప్లైంట్స్ అనగా ఆకాశరామన్న ఫిర్యాదులను సాకుగా చూపి, ఎలాంటి విచారణ చేయకుండానే, విచారణ చేసినట్లు తప్పుడు నివేదికలు తయారు చేసుకొని 30.08.2022న అక్రమంగా సస్పెండ్ చేసి, సస్పెన్షన్ అలెవెన్సు నిలిపి, చేసిన తప్పులు కప్పిపుచ్చుకొనుటకు అక్రమంగా కొకర్చేడు జిల్లా పరిషత్ హైస్కూల్ లో అక్రమ పోస్టింగ్ ఇచ్చిన ఘటనపై విచారించి చర్యలు తీసుకోవాలని ప్రతినెల మూడవ శుక్రవారం జరిగే ఎంప్లాయ్ గ్రీవెన్స్ డే లో భాగంగా నేడు హిందీ టీచర్ మరియు బహుజన టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు కె. సతీష్ కుమార్ పిర్యాదు చేసినట్లు తెలిపారు.

కె. సతీష్ కుమార్ మాట్లాడుతూ కర్నూలు డీఈఓ మరియు కార్యాలయ సిబ్బంది కలిసి 02.11.2019 న భాషోపాధ్యాయులు నుండి స్కూల్ అసిస్టెంట్ హిందీ గా అప్గ్రేడ్ చేయకుండా 15 నెలలు వేధించి 16.01.2021న పదోన్నతి కల్పించి బిలకలగూడురు ప్రాథమికోన్నత పాఠశాలలో ఇవ్వాల్సిన పదోన్నతిని, రేవనూరు జిల్లా పరిషత్ హైస్కూల్ లో ఇచ్చి తప్పు చేశారని తెలిపారు. అంతేకాకుండా సంవత్సర కాలంగా కొనసాగుతున్న అక్రమ సస్పెన్షన్ రద్దు చేస్తూ, పదోన్నతి జాప్యం వలన తాను కోల్పోయిన సీనియారిటీ మరియు బెనిఫిట్స్ లను నియమ నిభంధనల మేరకు మంజూరు చేసేలా తగు ఆదేశాలు జారీ చేయాలని, తనను ఆర్థికంగా, మానసికంగా వేధిస్తున్న ఉదంతంపై జాయింట్ కలెక్టర్ ద్వారా సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కె. సతీష్ కుమార్ విద్యా వ్యవస్థ లోని లోపాల పై మాట్లాడుతూ తప్పుడు కుల ధృవీకరణ పత్రాలతో ఉద్యోగం చేసేవారిని, తప్పుడు సర్టిఫికెట్ల తో పదోన్నతులు పొందేవారిని, బదిలీలల్లో మోసాలు చేసేవారిని, విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిని, పదవ తరగతి పరీక్షలలో మాస్ కాపీయింగ్ కు పాల్పడే వారిని, స్కూల్ నిధులు, ఎంఇఓ ఆఫీస్ నిధులు స్వాహా చేసే వారిని కాపాడుతూ, సకాలంలో చర్యలు తీసుకోకుండా ఆర్జేడీ కడప, డీఈఓ కర్నూలు మరియు వారి కార్యాలయ సిబ్బంది వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

పై అంశాలలో దాదాపుగా బహుజన టీచర్స్ ఫెడరేషన్ ఆద్వర్యంలో ఫిర్యాదులు చేస్తే ఆర్జేడీ




కడప, డీఈఓ కర్నూలు వారలు 200 మంది ఉద్యోగులపై కేవలం తూతూ మంత్రపు చర్యలు తీసుకొని ప్రభుత్వ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

కె. సతీష్ కుమార్, హిందీ అను నా హక్కు అయిన సముచిత స్థానం జిఒ 77, తేది : 30.10.2019 ప్రకారం పదోన్నతుల్లో భాగంగా బిలకలగూడురు ప్రాథమికోన్నత పాఠశాలలో కానీ, సస్పెన్షన్ చేసిన చోట జిఒ 189, తేది : 20.04.1999 ప్రకారం రేవనూరు జిల్లా పరిషత్ హైస్కూల్ లో కానీ, గౌరవ ఎస్.సి కమీషన్ చైర్మన్, ఎపి వారు సూచించిన విధంగా నంద్యాల పరిసర ప్రాంతాల్లో కానీ పోస్టింగ్స్ ఇచ్చేలా తగు ఆదేశాలు మంజూరు చేయాలని కలెక్టర్ సృజన గారికి విజ్ఞప్తి చేస్తు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

# డెంగ్యూ నివారణకు అవగాహనే కీలకం.

ఆంధ్ర ప్రగతి సిరివెళ్ల ఆగస్టు18: శుక్రవారం సిరివెళ్లలోని తెలుగు పేటలో డెంగ్యూ కేసు నమోదు కావడంతో మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి మరియు సిహెచ్ఓ రామ్మోహన్ రెడ్డి డెంగ్యూ కేసు చుట్టుపక్కల ప్రాంతాల్లో లార్వా నివారణ చర్యలు స్ప్రేయింగ్ మరియు ఫాగింగ్ చేయించారు .మరియు నీటి నిలువలను వారానికి ఒకసారి తీసివేసి ఫ్రైడే-డ్రైడే సక్రమంగా నిర్వహిస్తే దోమలఉత్పత్తినిఅరికట్టవచ్చని తెలిపారు. జ్వరాలన్నీ డెంగ్యూజ్వరాలుకావని జ్వరం వచ్చిన వెంటనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకోవాలని తెలిపారు. ఏడీస్ ఈజిప్టే అనే దోమ కాటువల్ల డెంగ్యూ జ్వరం వ్యాపిస్తుందని తెలిపారు. ఈ రకం దోమలు ఎక్కువగా పగటిపూటనే



కుడతాయని, ఇవి ఎక్కువగా మంచినీటి నిలువలో పెరుగుతాయనిఇంటి లోపల బయట నీటిని నిలువల్ని వారానికి ఒకసారి తీసివేసి కొత్తగా నింపుకోవాలని తెలిపారు. వర్షాకాలంలో దోమల పెరుగుదలసాధారణమేనని దోమల నివారణపై అవగాహన కలిగి ఉంటే దోమలఉత్పత్తిఅరికట్టవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పీ.హెచ్.ఎన్ సరస్వతి సూపర్వైజర్ అమినాబి ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూ పోరాటాలకు సిద్ధం కండి సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు పిలుపు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 18:
ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నంద్యాల జిల్లా సమితి సమావేశం పట్టణంలోని సిపిఐ కార్యాలయం నందు సంఘం జిల్లా అధ్యక్షులు కే రాధాకృష్ణ అధ్యక్షతన జరిగింది.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ జిల్లాలోని సాగు భూముల కోసం ఉపయోగపడే ప్రభుత్వ భూములు, ఇండ్ల స్థలాల కోసం ఉపయోగపడే భూములు ఉన్నాయని, వాటిని భూస్వాములు, అధికార పార్టీ నాయకులు, ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తూ చేస్తున్నారని. వాటిని ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకొని భూమిలేని పేదలకు పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం గా భూ పోరాటాల ద్వారా భూములను పేదలకు స్వాధీనం చేసి ఇవ్వడానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఏ సుబ్బరాయుడు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ నెలలో బాపట్లలో జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర మహా సభలు జయప్రదానికై సంఘ సభ్యులు నాయకులు అందరు కృషిచేసి జిల్లా నుండి ఎక్కువమంది వ్యవసాయ కార్మికులను సమ్మక్కరించాలని, ఈనెల 17 నుండి నంద్యాల పట్టణంలో ప్రారంభమైన సిపిఐ రాష్ట్ర బస్సు జాత నంద్యాల జిల్లాలో ఒకటో తారీఖున ప్రవేశించిందని ఈ బస్సు జాతరను సంఘ నాయకత్వాన పెద్ద ఎత్తున స్వాగతం తెలిపి ఎక్కువ మందిని పాల్గొనేలా




కృషి చేయాలని తెలిపారు.

ఈ సమావేశంలో పాల్గొన్నవారు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాప్ ఉపాధ్యక్షురాలు మహేశ్వరమ్మ కోశాధికారి లక్ష్మీదేవి, మాణిక్యం అమ్మ ,ముంతాజ్, రాని, బాల వరదరాజు, సుంకన్న సామేలు తదితరులు పాల్గొన్నారు.

# సాగు నీరు లేదు...తాగు నీరు లేదు..
# ఇదే వైసిపి పాలన...మాజీ ఎమ్మెల్యే భూమా

ఆంధ్ర ప్రగతి గోస్పాడు ఆగస్టు 18:
వైసిపి ప్రభుత్వంలో రైతులు పంటలు పండించు కోవా లంటే సాగు నీరు లేదు..ప్రజలు తాగేందుకు మంచినీరు కూడా లేదని నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఎద్దేవా చేశారు.

తెలుగుదేశం పార్టీ మినీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన భవిష్యత్తు కు గ్యారంటీ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోయెందుకు ఉద్దేశించిన కార్యక్రమంలో భాగంగా గొస్పడు మండలం తెల్లపురి గ్రామంలో నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా పర్యటించారు

ఈ సందర్భంభూమా ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.టిడిపి ప్రభుత్వం వచ్చాక సమస్యలన్నీ తీరుస్తానని పెడలకోసం తల్లికివందనం" పథకం ద్వారా ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.15,000 లు ,18 ఏళ్ళు నిండిన స్త్రీకి " ఆడబిడ్డనిధి " కింద నెలకు 1500 రూపాయలను నేరుగావారిఖాతాల్లో జమ చేస్తామని ,"దీపం " పథకం ద్వారా ప్రతి కుటుంబానికి
ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తామని,"ఉచిత బస్సు ప్రయాణం " పథకం ద్వారా మహిళలందరికీ టికెట్టులేని ప్రయాణ సౌకర్యం కలిగిస్తామని,
"అన్నదాత పథకం ద్వారా ప్రతి రైతుకు ఏటా 20000 రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తామని"
"యువతకి నిరుద్యోగ భృతి 3000 చొప్పున ప్రతి నెల ఇస్తామనీ హామీ ఇచ్చారు
వైసిపి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు..
నంద్యాల నియోజక వర్గంలో టిడిపి హయాంలో పల్లెలు అభివృద్ధి పథంలో దూసుకు పోయాయని నేడు రైతులకు సాగు నీరు రాక పంటలు పండించే పరిస్తితి లేదని తాగు నీరు లేక అనేక గ్రామాలు ఇబ్బందులు పడుతున్నారని భూమావిమర్శించారు.. వీధి దీపాలు లేక గ్రామాలు అంధకారంలో పారిశుధ్యం లేక ప్రజలు రోగాల బారిన పడుతున్నారని భూమా ఆవేదనవ్యక్తంచేశారు.2024ఎన్నికల్లో వైసిపిని చిత్తు చిత్తుగా ఓడించి టిడిపి నీ అధికారంలోకి తెచ్చుకుంటేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని భూ మా తెలిపారు.ప్రతి ఒక్క కార్యకర్త టిడిపి అధికారలోకి రావడానికి కృషి చెయ్యాలని భూమా పిలుపు నిచారు..కార్యక్రమంలో గోస్పాడు మండల కన్వీనర్ ఏరాసు చంద్రశేఖర్ రెడ్డి,తెల్లపూరి గ్రామ టీడీపీ నాయకులు కాటంరెడ్డి తోలశీస్వర రెడ్డి,తెల్లపూరి గ్రామ సర్పంచ్ కాటంరెడ్డి సుధమని ,మాజీ సర్పంచ్ వేణు,వెంకట సుబ్బారెడ్డి, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు భారీగా పాల్గొన్నారు.





# ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి.

**-అధికారులను సూచించిన జాయింట్ కలెక్టర్ తాటిమాకుల రాహుల్ కుమార్ రెడ్డి.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు 18:
ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఉద్యోగుల గ్రీవెన్స్ డేను నిర్వహిస్తోందని సమస్యలను నిశితంగా పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ తాటిమాకుల రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ డే నిర్వహించి వివిధ కార్యాలయాల సిబ్బంది నుండి అర్జీలు స్వీకరించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ తాటిమాకుల రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలను నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేసారు. ఉద్యోగుల గ్రీవెన్స్ డే లో స్వీకరించిన అర్జీలకు సంబంధించి అధికారులు తీసుకున్న చర్యలు సంబంధిత పూర్తి సమాచారంతో వచ్చే సమావేశానికి రావాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వుల నెం.1233 లోని ఆదేశాల మేరకు నెలలో ప్రతినెల 3వ శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ డే ను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు.జిల్లాలో వివిధ శాఖల నుంచి 19 మంది ఉద్యోగులు తమ సమస్యలపై జాయింట్ కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు వాటిలో కొన్ని.

1) స్త్రీశిశు సంక్షేమ శాఖలో పనిచేస్తున్న సూపర్వైజర్ పల్లె ధరణమ్మ తనకు కేవలం 8 నెలలు మాత్రమే పదవి విరమణ కాల వ్యవధి వుందని.... నన్ను కడప జిల్లా దువ్వూరు మండలం చాపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టుకు బదిలీ చేయడం జరిగిందని.. తన బదిలీని నిలుపుదల చేయుటకు చర్యలు గైకొనగలరని కోరుతూ జెసి కి దరఖాస్తు సమర్పించుకున్నారు.

2)సచివాలయం హెల్త్ వార్డు సెక్రటరీ మరియు ఎఎన్ఎం కార్యదర్శులను గ్రేడ్ 3కి బదులుగా గ్రేడ్ 2 గా పరిగణించాలని, అలాగే ఏఎన్ఎంలకు యూనిఫామ్ అలవెన్సులు ఇవ్వాలని, రెగ్యులర్ అయిన సచివాలయం ఏఎన్ఎంలకు హెచ్ ఆర్ ఎం ఎస్ లాగిన్ లో సాధారణ సెలవుల సెలవులు జమ కాలేదని, జమ అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేస్తూ జాయింట్ కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

## ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలని జిల్లా కలెక్టర్ ను కోరిన మాజీ ఎమ్మెల్యే భూమా.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 18:
నంద్యాల మండలం పుసులూరు,గోస్పాడు మండలం తెళ్ళపూరి గ్రామాలకు రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించాలని నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..ఈ మేరకు ఆయన శుక్రవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ను కలిసి కోరారు. ప్రధానంగా కుందు పరివాహక ప్రాంతాలలో కుందూ నుండి ఆయా గ్రామాలకు నీటి సరఫరా జరుగుతుందని అయితే పరిశ్రమల కాలుష్యం వల్ల కుందూ నీరు కలుషితం అయ్యిందని ఇదే నీటిని డైరెక్ట్ పంపింగ్ చేస్తూ ప్రజలకు నీటి సరఫరా చేస్తున్నారు అని కలెక్టర్ కు భూమా వివరించారు పలితంగా ప్రజలు అనేక రోగాలు బారిన పడుతున్నారని భూమా కలెక్టర్ కు తెలిపారు.నీటిని శుద్ధి చేసి లేదా ప్రత్యా మ్నాయ పద్ధతిలో కుందూ పరివాహక ప్రాంతం ప్రజలకు తాగు నీటిని సరఫరా చేయాలని భూమా కలెక్టర్ ను కోరారు.

## నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన జాయింట్ కలెక్టర్.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 18:
శుక్రవారం నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ తాటిమాకుల రాహుల్ కుమార్ రెడ్డి నూతనంగా బాధ్యతలు చేపట్టారు. వేద పండితుల పూజా కార్యక్రమాలు అనంతరం శుక్రవారం నాడు నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్గా తాటిమాకుల రాహుల్ కుమార్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు.

# ప్రహరీ గోడను పడగొట్టిన పంచాయతీ అధికారిపై చర్యలు తీసుకోవాలి.

ఆంధ్ర ప్రగతి పాణ్యం ఆగస్టు 18: పాణ్యం లో బస్టాండ్ సమీపంలో ఉన్న7వ అంగనవాడి సెంటర్ ప్రహరీ గోడ పడగొట్టిన గ్రామ పంచాయితీ ఈఓపై చర్యలు తీసుకోవాలి .నోటీసులు ఇవ్వకుండా ప్రహరీ గోడ కూల్చడం దారుణం. పాణ్యం బస్టాండ్ లోని 7వ అంగన్వాడి కేంద్రం 17 సంవత్సరాల కిందటనే నిర్మాణం చేపట్టారు అప్పటి అధికారులు నిర్మాణం చేపట్టడానికి ఎలా పర్మిషన్ ఇచ్చారు ఇప్పుడు రహదారికి అడ్డుగా ఉన్నదని కేవలం ఒక వ్యక్తి స్పందన అర్జీ పదేపదే ఇస్తున్నారని, నోటీసులు ఇవ్వకుండా ఎలా కుల్చారు ఇదేవిధంగా పాణ్యం లో ఎన్నో స్థలాలు కొందరు రాజకీయ నాయకుల స్వార్థంతో షాపులు కేటాయించుకొని గ్రామపంచాయతీకి రూపాయి కూడా కట్టకుండా జీవనం సాగిస్తున్నటువంటి వారిపైన ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు కేవలం విద్యార్థులపైనే కక్ష చూపించడం ఎవరు అడిగే వారు లేరనే స్వార్థంతోనే రాజకీయ నాయకులు అండదండలతో గోడను కుల్చారు. జిల్లా అధికారులు విచారణ చేసి గతంలో ఆ యొక్క నిర్మాణానికి పర్మిషన్ ఇచ్చినటువంటి అధికారుల పైన వెంటనే చర్యలు తీసుకోవాలని ఇప్పుడు ఉన్నటువంటి గ్రామపంచాయతీ అధికారి గారికి నోటీసులు ఇవ్వాలని భారత విద్యార్థి ఫెడరేషన్ అలాగే సిఐటియు మండల నాయకుడు బత్తిని ప్రతాప్, భాస్కర్ లు మాట్లాడుతూ టీచర్ కూల్చావద్దు అని బతిమిలాడిన ఆమెను తోసివేసి కూల్చారు. పాణ్యం లో అధికారులకు దయ, కనికరం ,అడ్డు అదుపు లేకుండాపోయినది. స్వార్థప్రయోజనం కోసం కూల్చారు. అని పాణ్యం ఎమ్మార్వో మల్లికార్జున రెడ్డి కీ వినతిపత్రం



అందజేశారు విద్యార్థులు కు న్యాయం జరగ పోతే ఎస్ ఎఫ్ ఐ సి ఐ టి యు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కలెక్టర్ ఆఫీసునుముట్టడిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో అంగనవాడి టీచర్లు, వెంకటమ్మ,మాబున్నిసా, అనిత, అనసూయ, తదీతరులు పాల్గొన్నారు.

# జిల్లా రైతాంగాన్ని ఆదుకునేందుకు సమిష్టిగా కృషి చేయండి.

**-జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగల భరత్ కుమార్ రెడ్డి. -జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు 18: తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో జిల్లా రైతాంగాన్ని ఆదుకునేందుకు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వైయస్సార్ సెంటినరీ హాలులో జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి గారితో కలిసి జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు వేసుకున్న పంటలను కాపాడుకుంటూ.... ఇంకా సాగు చేయని పొలాల్లో ప్రత్యమ్నాయ పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహిస్తూ జిల్లా రైతాంగాన్ని ఆదుకునేందుకు సమిష్టిగా కృషి చేయాలని అధికారులను సూచించారు. సాగునీటి కాలువలు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల పరివాహక ప్రాంతాల్లో రైతులు ఆరుతడి పంటలు వేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వరికి బదులు మొక్కజొన్న, జొన్న, చిరుధాన్యపు పంటలు వేసుకునేలా చూడాలన్నారు. పాడి రైతులకు




వెటర్నటి డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక అధికారిని ఆయన సూచించారు. ఉద్యాన శాఖ ద్వారా విదేశీ మాదకద్రవ్య కొత్త వాణిజ్య పంటలను అన్వేషించి రైతులు వేసుకునేలా ప్రోత్సహించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజును ఆదేశించారు. అలాగే ఆయిల్ ఫామ్ సంబంధించి సన్ఫ్లవర్, కుసుమ నూనె సాగయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతుల వేసిన పంటకు ఈ క్రాప్ బుకింగ్ తో పాటు ఈ కేవైసీ కూడా సెప్టెంబర్ 15 లోపల పూర్తిస్థాయిలో చేయాలని సంబంధిత వ్యవసాయ అధికారులను ఆదేశించారు. పగిడ్యాల, పాణ్యం, గడివేముల మండలాల్లో ఇప్పటివరకు ఈక్రాఫ్ బుకింగ్ చేపట్టకపోవడానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాకు కేటాయించిన 21వేల సిసిఆర్సి కార్డుల పంపిణీ లక్ష్యాన్ని అధిగమించేందుకు వ్యవసాయ అధికారులు పెద్ద ఎత్తున కృషి చేయాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమయ్యే విత్తనాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఏపీ సీడ్స్, మార్కెడ్ అధికారులను సూచించారు. రైతులకు అవసరమయ్యే సూచనలు సలహాలు ఇచ్చేందుకు వ్యవసాయ శాఖ ఏడీఏలు, గ్రామ వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, మార్కెటింగ్, మార్కెడ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వము చుక్కల భూములను పట్టా భూమిగామార్చాలి.-సిపిఐ

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 18:

రాష్ట్ర ప్రభుత్వము లక్షల ఎకరాల చుక్కల భూములను సెక్షన్ 22/ %ూ% కింద నిషేధ జాబితా తొలగించిన జిల్లా రెవెన్యూ అధికారులు వాటిని అమలు పరచకపోవడం విచారకరమని చుక్కల భూములు ఉన్న రైతులు పట్టా భూమిగా మారకపోవడం వల్ల త్రీవ ఇబ్బందులు గురవుతున్నారని వెంటనే ప్రభుత్వ అధికారులు చుక్కల భూములను పట్టా భూములుగా మార్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి. ఎన్. రంగనాయుడు. సిపిఐ. జిల్లా సహాయ కార్యదర్శి. ఎస్. బాబా పక్రుద్దీన్. ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

సందర్భంగా పై నాయకులు మాట్లాడుతూ

రాష్ట్ర ప్రభుత్వము చుక్కల భూములను నిషేధిత జాబితా నుండి తొలగించిన నంద్యాల జిల్లాకు జీవో నెంబర్ 179 ద్వారా నిషేధిత నుండి తొలగించిన భూములు రిజిస్టర్ అయ్యేందుకు ప్రభుత్వం వీలు కల్పించిన కానీ భూమి స్వభావము. అనే కాలంలో ప్రభుత్వ భూమి అని ఉన్నందున ఆయా సబ్ రిజిస్ట్రర్లు ఆఫీసులో సిస్టం తీసుకోక పోవడం వలన రైతులకు అత్యవసర పరిస్థితిలో రైతులు వాటిన అమ్ముకునేందుకు వీలు కావడం లేదని దీనికి రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య కారణమని అన్నారు.

నంద్యాల జిల్లా రెవెన్యూ అధికారులకు సీఎం ద్వారా సంతకం తో వచ్చిన బువ్వకు పత్రాలను ఇంతవరకు సంబంధిత ఏ ఒక్క రైతుకు ఇవ్వకపోవడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇంతవరకు ఆయా




పొలాలు రిజిస్టర్ కానందున రైతులు మానసికంగా ఆర్థికంగా ఇబ్బందులు గురి అవుతున్నారని వెంటనే జిల్లా రెవెన్యూ అధికారులు ఆయా మండలాల్లో ఉన్న చుక్కల భూముల రికార్డులను తెప్పించుకొని వాటిని ప్రభుత్వ భూమిగా ఉన్న పొలాలను పట్టా భూమిగా మార్పు చేసి రిజిస్టర్ జరిగే విధంగా ఉమ్మడి ప్రొసీడింగ్ ఆర్డర్ గా ఇవ్వాలని పై నాయకులు డిమాండ్ చేశారు.

# తప్పనిసరిగా రైతులందరూ ఈ పంట నమోదు చేసుకోవాలి.

**-మండల వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర్ రెడ్డి**

ఆంధ్ర ప్రగతి మహానంది ఆగస్టు18: తప్పనిసరిగా రైతులందరూ ఈ పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి బి. నాగేశ్వరరెడ్డి అన్నారు. మహానంది మండలం అబ్బీపురం గ్రామంలోని పంట నమోదు కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారి బి. నాగేశ్వరరెడ్డి శుక్రవారం పర్యవేక్షించారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో, ఈ పంట నమోదు కార్యక్రమము ప్రారంభం అయిందని తెలియజేశారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు వేసిన ప్రతి పంటను పొలం దగ్గరకు వెళ్లి తప్పులు లేకుండా ఈ పంట నమోదు చేయాలన్నారు.ప్రతి రైతు తాను వేసిన పంట వివరాలను సంబంధిత రైతు భరోసా కేంద్రంలోని వ్యవసాయ శాఖ సిబ్బందిని కలిసి పంట నమోదుచేయించుకోవాలన్నారు.. రైతులు తమ పంటను ఆన్లైన్లో నమోదు చేసుకోవడం వల్ల, ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టం జరిగినప్పుడు, పెట్టుబడి రాయితీ పొందడానికి అర్హులు అవుతారని, అలాగే పంట బీమా పొందడానికి , రైతులు తాము పండించిన పంటను ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోవడానికి , రైతు భరోసా మరియు సున్నా వడ్డీ రాయితీ వర్తించడానికి,తదితర ప్రభుత్వ పథకాల లబ్ధి పొందడానికి పంట నమోదు తప్పనిసరని,రైతులు ఈ క్రాప్ బుకింగ్ నమోదులో సహకరించాలని కోరారు. రైతులు తమ పంటను ఆన్లైన్లో నమోదు చేసుకోవడానికి సెప్టెంబరు 15 చివరి తేదీ అని తెలియజేశారు.ఈ మండల వ్యవసాయ అధికారి బి. నాగేశ్వర రెడ్డి, వి ఏ ఏ కృష్ణ కాంత్, గ్రామ రైతులు పాల్గొన్నారు.



# సీఎం జగన్ ను కలిసిన నూతన ఎమ్మెల్సీలు.

ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 18: సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌ను కలిసిన నూతన ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేసిన కర్రి పద్మశ్రీ, డా. కుంభా రవిబాబు గవర్నర్ కోటాలో ఏపీ శాసనమండలి సభ్యులుగా నియమితులైన పద్మశ్రీ, రవిబాబు కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన నూతన ఎమ్మెల్సీలు పద్మశ్రీ, రవిబాబు.



# స్వాతంత్ర్యసమరయోధులు నేతాజి సుభాష్ చంద్రబోస్ సేవలు చిరస్మరణీయం.

ఆంధ్ర ప్రగతి డోన్ ఆగస్టు 18: డోన్ పట్టణంలో డోన్ డిఎస్పి ఆఫీస్ నందు సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో డోన్ డిఎస్పీ వై.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన మనదేశస్వాతంత్ర్యసమరయోధులు శ్రీ నేతాజి సుభాష్ చంద్రబోస్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించి వారిని స్మరించుకున్నారు. మన దేశానికి వారు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.



ఈ కార్యక్రమంలో డోన్ డిఎస్పీ ఆఫీసు సిబ్బంది సాయికిరణ్, దస్తగిరి, లక్ష్మీరాజ్, రమేష్, సలీం, శివ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డోన్ డిఎస్పీ వై.శ్రీనివాస రెడ్డి, సామాజిక కార్యకర్త పి. మహమ్మద్ రఫి లుమాట్లాడుతూ మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని డోన్ డిఎస్పి వై.శ్రీనివాస రెడ్డి, సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి లు కోరారు.

# లీడ్ ప్రభాస్ సినిమా యోగి రీ రిలీజ్ సందర్భంగా థియేటర్ లో స్క్రీన్ ను చించివేసిన అభిమానులు.

**-థియేటర్ కు 20 లక్షల రూపాయలు నష్టం.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 18: నంద్యాల పట్టణంలో ప్రభాస్ సినిమా యోగి రీరిలీజ్ సందర్బంగా సంబరాలు ఫ్యాన్స్ రాజ్ థియేటర్ స్క్రీన్ దగ్గర డాన్స్ చేస్తూ అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. కొంతమంది స్క్రీన్ దగ్గరికి వెళ్ళి పాటలకు డాన్స్ చేస్తుండగా స్క్రీన్ మీద పడ్డారు. స్క్రీన్ రెండు చోట్ల చిరిగిపోయి బాగా డామేజ్ అయింది. ఈ సంఘటనతో థియేటర్ యాజమాన్యం సినిమాను నిలిపివేసింది. థియేటర్ లో స్టార్ హీరోల సినిమాలను ప్రదర్శించాలంటే మాకు భయంగా ఉంటుందని యాజమాన్యం, సిబ్బంది తెలిపారు.



# కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావాలంటే ఎంపీ టికెట్ లక్ష్మీ నరసింహ యాదవ్ కుఇవ్వాలి.

**-దొర్నిపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సి నాగయ్య.**

ఆంధ్ర ప్రగతి దొర్నిపాడు ఆగస్టు18: నంద్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రావాలన్నా పార్టీ బలోపేతం కావాలన్నా నంద్యాల పార్లమెంటు టికెట్ జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్ కు ఇవ్వాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాకలి నాగయ్య అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీ నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో త్వరలోనే జిల్లాలో గడపగడపకు మనకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు కాంగ్రెస్ రావాలి ప్రజల కష్టాలు తీరాలి అని ప్రజలు కోరుతున్నారన్నారు జిల్లాలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



# వేద ఆశీర్వాదాలతో బాధ్యతలు చేపట్టిన జాయింట్ కలెక్టర్.

ఆంధ్ర ప్రగతి మహానంది ఆగస్టు 18: నంద్యాల జిల్లా జెసి కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ గా తాటిమాకుల రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి సమాచారం అందుకున్న మహానంది దేవస్థానం ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, ట్రస్టు బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర్ రెడ్డి,పర్యవేక్షకులు ఓ వెంకటేశ్వర్లు, ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర్ అవధాని, హనుమంత రాయ శర్మ, అర్చకులు అర్జున్ శర్మలు వేదమంత్రాల సాక్షిగా జెసి బాధ్యతలను స్వీకరించారు.అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి, తీర్థప్రసాదాలు అందజేయగా, ఆలయ ఈవో,చైర్మన్ శేష వస్త్రంతో సత్కరించి స్వామి వారి జ్ఞాపకం అందజేశారు.అదేవిధంగా

నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డి ఆగస్ట్ 15,వ తేదీన ఇండియన్ ప్రెసిడెంట్ అవార్డు అందుకున్న సందర్భంగా జిల్లా ఎస్పీని కలిసి శ్రీ కామేశ్వరీ దేవి, మహానందీశ్వరుల ఆశీస్సులతో ఇంకా ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, ట్రస్టు బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర్ రెడ్డి లు అన్నారు.స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి జ్ఞాపికను అందజేయగా, వేదపండితులు రవి శంకర అవధాని వేద ఆశీర్వచనాలు చేసి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహానంది దేవస్థానం పర్యవేక్షకులు ఓ .వెంకటేశ్వర్లు, వేద పండితులు రవిశంకర్ అవధాని, హనుమంత రాయ శర్మ, అర్చకులు అర్జున్ శర్మలు, తదితరులు పాల్గొన్నారు.



# ఐక్యరాజ్య సమితికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు.

## --యూఎన్ఓ, వరల్డ్ బ్యాంకుల్లో ప్రసంగించే అవకాశం. - -అమెరికా అధ్యక్ష భవనం సందర్శించే చాన్స్ కూడా.

## --ప్రభుత్వ స్కూళ్లల్లో చదివిన 10 మంది ప్రతిభావంతుల ఎంపిక. -ప్రభుత్వ ఖర్చుతో సెప్టెంబర్ 15 నుంచి 27 వరకు అమెరికా సందర్శన .



ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 18 :
రైతుకూలి బిడ్డ అమ్మాజాన్, లారీ డ్రైవర్ కుమార్తె రాజేశ్వరి, సెక్యూరిటీ గార్డు కూతురు జ్యోత్స్న, కౌలురైతు కొడుకు అంజన సాయి, రోజుకూలీ బిడ్డ గాయత్రి, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ కుమార్తె శివలింగమ్మ, టీచర్ కూతురు మనశ్విని, రైతుబిడ్డ యోగీశ్వర్, మెకానిక్ కూతురు రిషితారెడ్డి, ఆటోడ్రైవర్ కుమార్తె చంద్రలేఖ.. వీరి కుటుంబాలకు పని ఉంటేనే రోజు గడిచేది.. లేకపోతే పస్తులే. ఇలాంటి వారి గురించి చెప్పుకోవడానికి ఏముంటుంది? అని అనిపించడం సహజం.
పైగా.. ఈ కోవకు చెందినవారు రాష్ట్రంలో లక్షల్లో ఉంటారు.. పత్రికలో రాసేటంతగా విషయం ఏముంటుంది అని కూడా అనుకోవచ్చు.. కానీ, చదువులో రాణించి ప్రభుత్వ ప్రోత్సాహంతో ఇప్పుడు ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించే అరుదైన అవకాశాన్ని సొంతం చేసుకోవడమే వీరు సాధించిన గొప్ప విజయం.
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఉత్తమ మార్కులు సాధించిన 150 మందిని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. వారికి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, మారిన బడుల తీరుపై పరీక్ష నిర్వహించగా మొత్తం 30 మంది ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. వీరికి కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ) కార్యదర్శి మధుసూదనరావు, యూఎన్ఓ స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకిన్‌కుమార్ నేతృత్వంలో నలుగురు సభ్యుల బృందం మౌఖిక పరీక్షలు నిర్వహించి పై 10 మందిని విజేతలుగా ఎంపిక చేసింది.
ఇప్పుడు వీరంతా సెప్టెంబర్ 15 నుంచి 27 వరకు ప్రభుత్వ ఖర్చుతో ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించడంతో పాటు ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో మాట్లాడతారు. రాష్ట్రంలో ప్రభుత్వం అమలుచేస్తున్న విద్యా సంస్కరణలపైన, పాఠశాలల అభివృద్ధిపైన మాట్లాడేందుకు సరైన ప్రతినిధులు విద్యార్థులేనని.. ఎంపికైన వారంతా పేద కుటుంబాల పిల్లలేనని పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, కమిషనర్ సురేష్‌కుమార్ తెలిపారు.
ఈ పర్యటనలో వీరు అమెరికా అధ్యక్ష భవనాన్ని సైతం సందర్శిస్తారన్నారు. విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వమే ఐక్యరాజ్య సమితికి పంపిస్తోందని, వీరికి అవసరమైన పాస్‌పోర్టు, వీసా వంటి అన్ని ఏర్పాట్లుచేసినట్లు వారు వివరించారు.
ఇక ఈ విద్యార్థుల విజయగాథ ఏమిటంటే..

**1) గిరిజన బాలికకు అద్భుత అవకాశం..**

కురుపాం మండలం కొండబారిడి గిరిజన గ్రామానికి చెందిన సామల మనశ్విని తల్లి కృష్ణవేణి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. మనశ్విని ప్రస్తుతం గుమ్మలక్ష్మీపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతోంది. గిరిజన కుగ్రామంలో పుట్టి పెరిగిన మనశ్విని అమెరికా వెళ్లనున్న పది మంది విద్యార్థుల్లో ఒక్కరిగా నిలిచింది. ఇటీవల జరిగిన ముఖ్యమంత్రి సభలో తన ప్రసంగం ద్వారా ఆకట్టుకుంది.

2) రైతు బిడ్డకు గొప్ప వరం ..

కర్నూలు జిల్లా కౌతాళం మండలం పొదలకుంట గ్రామానికి చెందిన మించాలవారి సోమనాథ్, గంగమ్మ ల నాలుగో సంతానం శివలింగమ్మ ఆదోని కేజీబీవీలో పదో తరగతి 541 మార్కులతో పాసైంది. బాలిక తండ్రి సోమనాథ్ కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేయడంతో పాటు ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. శివలింగమ్మ అమెరికా వరకు వెళ్లే అవకాశం రావడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నట్లు సోమనాథ్ ఎక్కడలేని ఆనందం వ్యక్తంచేశారు.

**3) ఐరాస సదస్సుకు రైతుబిడ్డ..**

తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నరసింగాపురం గ్రామానికి చెందిన వంజవాకం నాగరాజు, విజయ దంపతుల రెండో కుమారుడు యోగీశ్వర్. తండ్రి ఉన్న ఎకరం పొలంలో వ్యవసాయం చేసుకునే రైతు. ఇద్దరి సంతానంలో పాప విద్యశ్రీ ఇంటర్ చదువుతుండగా, కుమారుడు యోగీశ్వర్ 10వ తరగతిలో 586 మార్కులు సాధించి జిల్లాలో రెండోస్థానం సాధించాడు. అమ్మఒడి, జగనన్న గోరుముద్ద తమబిడ్డల చదువుకు ఎంతో సహకరించాయని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

**4) కేక.. చంద్ర లేఖ..**

అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం ఎటపాక గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన మోతుకూరి రామారావు, మణి దంపతుల రెండో కుమార్తె చంద్రలేఖ. రాష్ట్ర విభజనతో కుటంబంతో భద్రాచలం నుంచి ఎటపాకకు వచ్చిన రామారావు చంద్రలేఖను స్థానిక కేజీబీవీలో చదివించారు. ఇటీవల పదో తరగతిలో 523 మార్కులు సాధించి కేజీబీవీ జిల్లా టాపర్‌గా నిలిచి ప్రభుత్వం అందించిన జగనన్న ఆణిముత్యాలు సత్కారం కింద రూ.50 వేల నగదు బహుమతి అందుకుంది. ఈ విజయమే ఆమెను ఐక్యరాజ్య సమితికి వెళ్లేలా బాటవేసింది.

**5) తల్లి కష్టంతో తల్లడిల్లి..**

పూట గడవడం కూడా కష్టమైన ఇంట్లో పుట్టిన షేక్ అమ్మాజాన్ ఏడేళ్ల క్రితం తండ్రిని కోల్పోయింది. రైతుకూలీ అయిన తల్లి కష్టంచూసి చదువుల్లో రాణించాలనుకుంది. ఐదో తరగతిలోనే వైఎస్సా ర్‌జిల్లా వేంపల్లిలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో సీటు తెచ్చుకుంది. ఇటీవల టెన్త్‌లో 581 మార్కు లు సాధించి రాష్ట్రస్థాయిలో జగనన్న ఆణిముత్యా లు సత్కారం కింద రూ.లక్ష నగదు బహుమతి అందుకుంది. ఇప్పుడు ఐరాస గడప తొక్కుతోంది. ప్రస్తుతం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో చేరింది.

**6) ప్రతిభ చాటిన సెక్యూరిటీ గార్డు బిడ్డ..**

కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం రమణక్కపేటకు చెందిన దడాల సింహాచలం ప్రైవేటు సెక్యూరిటీ గార్డు. ఈయన భార్య గృహిణి. వీరి రెండో కుమార్తె జ్యోత్స్న టెన్త్‌లో 589 మార్కులు సాధించింది. దీంతో పాటు జగనన్న ఆణిముత్యాలు రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారాన్ని సైతం అందుకుంది. ఇప్పుడు కృష్ణాజిల్లా కంకిపాడు మండలం ఈడుపుగల్లులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయం ఐఐటీ అకాడమీలో ఇంటర్ చదువుతూ అమెరికా అవకాశాన్ని అందిపుచ్చుకుంది.

**7) కౌలురైతు కొడుకు ఘనత..**

పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు మండలం వల్లూరుపల్లికి చెందిన జి.గణేష్ అంజనసాయి ఏలూరు జిల్లా అప్పలరాజుగూడెం గురుకుల పాఠ శాలలో చదువుకున్నాడు. టెన్త్‌లో 581 మార్కులు సాధించి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. తండ్రి గోపి కౌలురైతు కాగా, తల్లి లక్ష్మి గృహిణి. కుటుంబానికి చదువు భారం కాకూడదని గురుకుల పాఠశాలలో సీటు తెచ్చుకున్నాడు.

**8.) 590 మార్కులతో అదరహో..**

తండ్రి కూలీ, తల్లి గృహిణి. తండ్రికి పని దొరికితేనే పూటగడిచే పరిస్థితి. తన భవిష్యత్‌ను చదువుల ద్వారా తీర్చిదిద్దుకుని, కుటుంబాన్ని బాగా చూసుకోవాలని బలంగా అనుకుంది పసుపులేటి గాయత్రి. ఏలూరు జిల్లా పెదపాడు మండలంలోని వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదివి ఏకంగా 590 మార్కులు సాధించి జిల్లాలోనే టాపర్‌గా నిలిచింది. అమెరికా బృందానికి ఎంపికైంది.

**9) మెరిసిన మెకానిక్ కుమార్తె..**

విజయనగరం శివారు జమ్మునారాయణపురంలో నివాసముండే అల్లం రామకృష్ణారెడ్డి, ఉదయలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. ప్రైవేటు సంస్థలో మెకానిక్‌గా పనిచేసే రామకృష్ణారెడ్డి రెండో కుమార్తె రిషితారెడ్డి స్థానిక మున్సిపల్ హైస్కూల్లో టెన్త్ చదివి 587 మార్కులు సాధించి, నూజివీడు ట్రిపుల్ ఐటీలో చేరింది. ఇప్పుడు అమెరికా వెళ్లే అరుదైన అవకాశం దక్కించుకుంది.

**10) నంద్యాల నుంచి అమెరికాకు..**

నంద్యాల పట్టణం బొమ్మలసత్రం ప్రాంతానికి చెందిన విద్యార్థిని సి.రాజేశ్వరి తండ్రి దస్తగిరి లారీడ్రైవర్, భార్య రామలక్ష్మమ్మ ఇంటివద్ద బట్టలు ఇస్త్రీ చేస్తుంటారు. వీరి పెద్ద కుమార్తె రాజేశ్వరి నంద్యాలలోని ఏపీ మోడల్ స్కూల్‌లో టెన్త్ చదివి 583 మార్కులు సాధించి నియోజకవర్గంలో టాపర్‌గా నిలిచింది. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించడంతో ఐరాసకు వెళ్లే అరుదైన అవకాశం కైవసం చేసుకుంది.

# రాజకీయవేడిలో తెలంగాణ ముఖచిత్రం

## -ఎన్నికల వేళ..ప్రధాన పార్టీల దూకుడు - ప్రజల్లో నిత్యం మమేకం అయ్యేలా వ్యూహం

## -ఎవరికి వారు బలసమీకరణలో బిజీ - అభ్యర్థుల వడపోత కార్యక్రమంలో నేతలు

నల్లగొండ,ఆగస్ట్18 :
తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గర పడడంతో రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు మరింత దూకుడును పెంచాయి. ఎవరికి వారు తమ పట్టు నిలుపుకోవాలన్న ప్రయత్నంలో బలసమీకరణలకు సిద్ధం అవుతున్నారు. ఎన్నికల ప్రచార పర్వాన్ని మరింత ముమ్మరం చేసే పనిలో అన్ని పార్టీల నేతలు నిమగ్నమయ్యారు. అలాగే గెలుపు గుర్రాలపై లెక్కలు వేసుకుంటున్నారు. అభ్యర్థుల వడపోత కూడా ఎవరిస్థాయిలో వారు చేస్తున్నారు. ఈ క్రమంలో జనంగోడును పట్టించుకోకుండా ముందుకు సాగుతున్నారు. ఇక్కడి సమస్యలపై పెద్దగా చర్చించడం లేదు. బిఆర్ఎస్ మాత్రం తామే అభివృద్ధి చేశామని ప్రచారం చేసుకుంటోంది. తెలంగానలో ఉన్న పథకాలు ఎక్కడైనా ఉన్నాయా అంటూ సవాళ్లు విసరుతున్నారు. చేరికలు, సమావేశాలు, ఆయారామ్ గయారామ్‌లతో ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయ సెగలు పుట్టిస్తోంది. ఎన్నికకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్ ఇంకా విడుదల కాకముందే బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికలను సవాల్‌గా తీసుకుని పనిచేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో గెలవడం అన్నది అన్ని పార్టీలకు అనివార్యంగా మారింది. ఈ నేపథ్యంలో బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీలు నువ్వా? నేనా? అన్నట్లుగా తలబడుతున్నాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు భారీ బహిరంగ సభలను ఏర్పాటే చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. ఇందులో భాగంగా అక్టోబర్‌లో వరంగల్ వేదికగా బిఆర్ఎస్ భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇక కాంగ్రెస్ కూడా బహిరంగ సభ కోసం ఏర్పాట్లు చేసుకునే పనిలో నిమగ్నమైంది. ఇకపోతే ఎన్నికలో గెలవడం ద్వారా హ్యాట్రిక్ సాధించి తమకు తిరుగు లేదని చెప్పాలని బిఆర్ఎస్ ఒకింత దూకుడుగానే ముందుకు సాగుతోంది. మంత్రి కెటిఆర్ అన్నీతానై వ్యవహరిస్తున్నారు. ప్రతిరోజు వ్యూహాత్మకంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గడప..గడపకు ప్రచారం చేస్తూ దూసుకపోతున్నారు. వరంగల్ సభకు ముఖ్యమంత్రి కెసిఆర్ హాజరవుతుండడంతో పార్టీ శ్రేణులంతా ఇప్పటి నుంచే జనసమీకరణలో నిమగ్నమయ్యారు. పెద్దఎత్తున బహిరంగ సభకు జనాలను తరలించే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బిఆర్ఎస్‌కు చెందిన పలువురు నేతలకు బాధ్యతలను అప్పగించబోతున్నారు. రాష్ట్రంలో మరోసారి తమకు ఎదురులేదని నిరూపించుకోవాలన్న కసితో గులాబీ నేతలు ఉన్నారు. కెసిఆర్ కూడా ఇదే వైఖరితో ఉన్నారు. మునుగోడులో విజయం సాధించడం అన్నది ఈజీ అన్న భావనలో బిజెపి బోల్తా కొట్టింది. తరవాత బండి సంజయ్‌ను మార్చడంతో బొక్క బోర్లా పడింది. ప్రస్తుతం రాష్ట్రంలో బిఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం తామే అని పదేపదే పేర్కొంటున్న బిజెపి నేతలకు చెక్ పడినట్లు అయ్యింది. ఎన్నికలో విజయం సాధించడంపై దృష్టి సారించిన కమలనాథులు అమిత్ షా పాల్గొనే బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. ఆయన సమక్షంలో చేరికలను ప్రోత్సహించా లని చూస్తున్నారు. రాష్ట్ర ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నా కాంగ్రెస్ వారిలో ఐక్యత కానరావడం లేదు. రేవంత్ నాయకత్వంలో పనిచేసేందుకు నేతలు సిద్దంగా లేరు. ఈ నేపథ్యంలో
మన తెలంగాణ మన కాంగ్రెస్ అనే నినాదంతో పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పూర్తి స్థాయిలో ప్రచారంలోకి దిగనున్నారు. పూర్తి స్థాయిలో ప్రచారాన్ని సాగించే విధంగా ఇన్‌చార్జ్ మాణిగం ఠాకూర్ ఇప్పటికే పార్టీ సీనియర్ నేతలతో మంతనాలు కూడా సాగించారు. ఎన్నికలు ముగిసేంత వరకు నాయకులు ఎవరు పార్టీ క్రమ శిక్షణను దాటవద్దని విజ్ఞప్తి చేశారు. అలాగే విబేధాలు ఏమైనా ఉన్నా వాటిని పూర్తిగా పక్కనపెట్టాలని సూచించారు. తప్పకుండా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారం లోకి వస్తుందన్న సంకేతాలు ఇస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ గెలుపు గుర్రానలు సిద్దం చేస్తోంది. ఆయా నియోజకవర్గాల్లో గెలిచేవారి జాబితాను రేవంత్ సిద్ధం చేసుకుంటున్నారని సమాచారం. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థికి గద్దర్ తనయుడు సూర్యను బరిలోకి దింపాలని రేవంత్ ప్లాన్ చేస్తున్నారని ప్రచారం.విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు హైదరాబాద్‌లోని కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఒకవేళ ఇక్కడ కాస్త అటు ఇటు అయితే.. పెద్దపల్లి పార్లమెంట్ నుంచి పోటీచేయించాలని కూడా రేవంత్ ప్లాన్. గద్దర్ మంచి స్వభావం ఉన్న వ్యక్తి.. ఆయన లేకున్నా.. కుమారుడి రూపంలో చూడాలని.. టికెట్ ఇచ్చి ఆ కుటుంబానికి అండగా నిలువాలని కాంగ్రెస్ భావిస్తోంది. దీంతో కవులు కళాకారుల అండను పొందాలన్నది రేవంత్ వ్యూహం కావచ్చు. అంటే ఎమ్మెల్యే లేదా ఎంపీగా సూర్యను బరిలోకి దింపడానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉందన్న ప్రచారం. ఇప్పటికే ఈ విషయాన్ని ఢిల్లీ హైకమాండ్‌కు కూడా రేవంత్ చేరవేసినట్లు.. అక్కడ్నుంచి గ్రీన్ సిగ్నల్ కూడా వచ్చిందని ప్రచారం సాగుతోంది. ఇలా బిఆర్ఎస్‌ను దెబ్బకొట్టాలన్న ఎత్తుగడగా ఉంది. మొత్తంగా ఇప్పుడు ప్రజలు ఎవరిని ఆదరిస్తారన్నది ముఖ్యం. వారి ఓటు ఎవరికి ఖచ్చింతంగా పడుతుందో ఇప్పుడే చెప్పలేక పోతున్నారు.

# మహా యోధుడు సర్వాయి పాపన్న

జనగామ,ఆగస్ట్18 :
సర్వాయి పాపన్న ఆగస్టు 18, 1650 నాడు నేటి జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్ గ్రామంలో జన్మించాడు. అప్పటి పాలకులు, జాగీర్దారులు, దొరలు, భూస్వాములు చేసే దురాగతాలను గమనించి గోల్కొండ కోటపై బడుగువారి జెండాను ఎగురవేయాలని నిర్ణయించి ఆ దిశగా ప్రస్థానం ప్రారంభించాడు. అయితే పాపన్నకు ఎలాంటి వారసత్వ నాయకత్వం కాని, ధనంకాని, అధికారం కాని లేవు. అయిననూ ఒక్కో మెట్టు ఎక్కుతూ దాదాపు 12 వేల సైనికులను సమకూర్చుకొని ఎన్నో కోటలను జయించి చివరకు గోల్కొండకోటను స్వాధీనపర్చుకొని 7 నెలలపాటు అధికారం చెలాయించాడు. తెలంగాణలో మొగలాయి విస్తరణను తొలిసారిగా అడ్డుకున్నది సర్వాయి పాపన్నే. ఒక సామాన్యవ్యక్తి శతృదుర్భేద్యమైన కోటలను వశపర్చుకోవడం అతని వ్యూహానికి నిదర్శనం. సర్వాయిపేట కోటతో మొదలుపెట్టి దాదాపు 20 కోటలను తన అధీనంలోకి తెచ్చుకున్నాడు. అతని ఆలోచనలకు బెంబేలెత్తిన భూస్వాములు, మొగలాయి తొత్తులైన నిజాములు కుట్రలు పన్ని సైన్యాన్ని బలహీనపర్చారు.

# శ్రావణ శుక్రవారంతో పోటెత్తిన భక్తులు

## -అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

విజయవాడ,ఆగస్ట్18 :
శ్రావణమాసం మొదటి శుక్రవారం కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మహిళా భక్తులు అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. విజయవాడ,బాసర, శ్రీశైలం,తిరుచానూరు తదితర ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయ అధికారులు అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహిస్తున్నారు. శ్రీ మహావిష్ణువు జన్మనక్షత్రం శ్రవణం కావడం వల్ల ఆ పేరుతో ఏర్పడిన శ్రావణమాసం అంటే శ్రీమహావిష్ణువు ధర్మపత్ని లక్ష్మీదేవికి ఎంతో ప్రీతిపాత్రమైనది. శ్రావణమాసంలో చేసే నోములు, వ్రతాలు, పూజల వల్ల లక్ష్మీకటాక్షం సిద్ధిస్తుందని భక్తులు విశ్వసిస్తారు. శ్రావణమాసం రెండవ శుక్రవారం నాడు మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తారు. శ్రావణమాసంలో మహాలక్ష్మిని పూజించడం వల్ల పసుపు కుంకాలతో, సౌభాగ్యంతో ఉంటారని భక్తులు అమ్మవారిని కొలుస్తుంటారు. ఇంద్రకీలాద్రిపై శ్రావణమాసం సందర్భంగా నాలుగో శుక్రవారం నాడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నారు.